నేడు క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు

6లో.



టి.నరసాపురంలో విద్యుద్దీపాలతో అలంకరించిన చర్చి

పూర్తికాని నారుమడులు..!

రబీ సాగు మరింత ఆలస్యం

రెండుజిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో వరిసాగు

ఇప్పటికీ 50 శాతం మాత్రమే నారుమడులు పూర్తి

ఫ్రిబవరిలోనూ నాట్లు పడే పరిస్థితి

సాగునీటిపై రైతుల్లో ఆందోళన

ఖరీఫ్‌లో తుపాన్ దెబ్బ

రబీసాగుపై గంపెడాశలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మిచౌంగ్ తుపాను ప్రభావం రబీసాగుపై తీవ్రప్రభావం చూపింది. రబీ నాట్లు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలఖారు వచ్చినా ఇప్పటికీ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ రబీ నారుమడులు పూర్తికాలేదు. ఇప్పటికీ రెండుజిల్లాల్లో 50 శాతం వరకు మాత్రమే నారుమడులు పూర్తయినట్లు తెలుస్తోంది. కొన్ని మండలాల్లో రైతులు ఇప్పుడే నారుమడులు వేయడం ప్రారంభించారు. ఈనెలఖారుకు కూడా నారుమడులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. రబీసాగు ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొనడంతో రబీలో నీటిఎద్దడి కష్టాలు గుర్తుచేసుకుని రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రబీ సాగుకు సంబంధించి పశ్చిమలో 2.25 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 56,190 ఎకరాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టనున్నారు. డిశంబర్ 15వ తేదీకి నారుమడులు పూర్తిచేసి జనవరి మొదటివారానికి నాట్లు పూర్తిచేయాలని అధికారులు భావించారు. ఇంతలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రెండు జిల్లాల్లోనూ ఇంకా ఖరీఫ్ ధాన్యం విక్రయాలు పూర్తికాలేదు. ఇప్పుడే రబీ నారుమడులు రైతులు ముమ్మరంగా వేశారు. నారుమడులు ఆలస్యమయ్యే ప్రాంతాల్లో వెదజల్లుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వెదజల్లితే ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉండటంతో రైతులు నారుమడుల వైపే మొగ్గుచూపుతున్నారు. తుపానుతో ఖరీఫ్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దిగుబడులు బాగా వచ్చినప్పటికీ ఖర్చులు విపరీతంగా అయిపోయాయి. కోతమిషన్‌తో ఎకరం మాసూలు గంటకు పూర్తికావాల్సి ఉండగా రెండు గంటలు పట్టినపరిస్థితి నెలకొంది. దీంతో ఎకరాకు ఒక్క కోతమిషన్‌కే మరో రూ.మూడు వేలు అదనంగా ఖర్చుపెట్టాల్సి వచ్చింది. తడిధాన్యం అరబెట్టేందుకు పెద్దఎత్తున కూలీల అవసరం పడటంతో ఖర్చులు తడిసిమోపుడయ్యాయి. తేమ, రంగుమార్పు పేరుతో మిల్లర్లు కిలోకు రూ.20 చొప్పున ధరలో కోత విధించారు. దీంతో తక్కువగా లెక్కించినా ఎకరాకు రూ.ఆరువేల వరకూ నష్టపోయిన పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో నీటిలో నాని పంట కుళ్లిపోవడంతో మాసూలు చేయకుండా వదిలేసిన పరిస్థితి సైతం నెలకొంది. దిగుబడి వచ్చినా ఖర్చులు పెరిగిపోవడంతో రైతులకు చిల్లిగవ్వ మిగలకపోగా, అప్పులు మూటగట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు రబీసాగుపైనా ఆశలన్నీ పెట్టుకున్నారు. అలాంటిది రబీసాగు సకాలంలో పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు. ఈ ప్రభావం దిగుబడిపై పడనుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది.

సాగునీరు సాఫీగా అందేనా..

గడిచిన నవంబర్ 11వ తేదీన ఏలూరు జిల్లాలో ఆ తర్వాత పశ్చిమలోనూ జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలు జరిగాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రబీలో సాగుకానున్న 4.60 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో నీరందించాలని నిర్ణయించారు. మొత్తం ఆయకట్టుకు 91.35 టిఎంసిల నీరు అవసరమని, కానీ ఈఏడాది అందుబాటులో ఉన్న సాగునీరు 82.49 టిఎంసిలు మాత్రమేనని ఇరిగేషన్ అధికారులు తేల్చారు. వంతులవారీ విధానం, అడ్డుకట్టలు, మోటారు ఇంజన్ల ద్వారా ఎత్తిపోయడం వంటి పద్ధతుల ద్వారా పూర్తి ఆయకట్టుకు సాగునీరందించనున్నట్లు తెలిపారు. ప్రతిఏటా సంక్రాంతికి దాదాపు నాట్లు పూర్తికావడంతో జనవరి 20వ తేదీనుంచి వంతుల వారీవిధానం అమల్లోకి తెచ్చేవారు. ఈసారి అలాంటి పరిస్థితి లేదనే చెప్పాలి. ఫిబ్రవరిలో కూడా నాట్లుసాగే అవకాశం ఉంది. ఏప్రిల్ నెలాఖరు వరకూ సాగునీరు అందించాల్సి ఉంటుంది. ఇప్పటికే సాగునీరు తక్కువగా ఉందని అధికారులు తేల్చారు. ఇలాంటి పరిస్థితిలో సాఫీగాసాగునీరు అందడంపై రైతుల్లో అనుమానాలు నెలకొన్నాయి. సాగునీటిఎద్దడి ఎదురై పంట దెబ్బతింటే పరిస్థితి ఏమిటన్న భయం అన్నదాతను వెంటాడుతోంది. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఇప్పటినుంచే రబీ ప్రణాళికలు సిద్ధంచేసుకుంటే తప్ప రైతులకు మేలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

పోలవరంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కొవ్వొత్తులతో అంగన్వాడీల నిరసన

13వ రోజుకు సమ్మె

6లో..

జిల్లాలో అంగన్‌వాడీలు 13వ రోజు సమ్మెలో భాగంగా ఆదివారం కొవ్వొత్తులతో తమనిరసన తెలిపారు. అలుపెరుగని పోరాటం చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడంతో వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమ్మెను ఉధృతం చేస్తున్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వీరికి మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి నేత చింతమనేని ప్రభాకర్ సంఘీభావం తెలిపారు. జీలుగుమిల్లిలో చెవిలో పూలు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నిడమర్రు, భీమడోలు, కలిదిండి, వేలేరుపాడు, చాట్రాయి, కొయ్యలగూడెం, మండవల్లి, చింతలపూడి, టి.నరసాపురం, పోలవరం మండలాల్లో సమ్మె యథావిధిగా కొనసాగింది.

ఏలూరులో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మొక్కజొన్నకు రూ.25 వేలు పరిహారమివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తుపాను వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న పంటలకు పరిహారంగా ఎకరాకు రూ.25 వేలు ప్రభుత్వం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కేతవరంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తుపాను ప్రభావం వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, పొగాకు మిర్చి పంటలను పరిశీలించారు. అనంతరం బాధిత రైతులతో పంట నష్టం ఖర్చులు వివరాలను, రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల కేతవరం గ్రామంలో వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం కోసం ప్రణాళిక రూపొందించకపోవడం దుర్మార్గమని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేతవరంలో రైతు తలారి గంగరాజు ఐదు ఎకరాల మొక్కజొన్న వేయగా ఎకరాకు రూ.22 వేలు దుక్కు, విత్తనాలు, పురుగుమందుల కోసం ఖర్చయ్యాయని తెలిపారు. వర్షాల ప్రభావంతో కుళ్లిపోయిన పంటలను దున్ని మళ్లీ పంటలు వేయాలంటే రూ.22 వేలు ఖర్చవుతుందని మొత్తం ఈ తుపాను వల్ల రెండుసార్లు ఖర్చు అదనంగా రూ.40 వేల వరకూ పెట్టుబడి అయిందని తెలిపారు. రెండోసారి విత్తనాలు వేయడంతో అధిక ఖర్చవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారని వాపోయారు. అలాగే పొగాకు, వరి, మిర్చి, పంటలు వందల ఎకరాలు నేలమట్టమయ్యాయని రైతులు రోడ్డునపడ్డారని తెలిపారు. రైతులను అన్నివిధాలా ఆదుకుంటానని చెప్పి కేవలం ప్రకటనలకే పరిమితయ్యారని ఆరోపించారు. తక్షణం వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు మొద్దు నిద్రవీడి తుపాను ప్రభావం వల్ల రైతులకు జరిగిన పంటనష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని తద్వారా రైతులకు రావాల్సిన ఆర్థిక సహాయం తక్షణం ప్రభుత్వం నుంచి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులందరినీ ఐక్యం చేసి వ్యవసాయ శాఖ కార్యాలయం ముట్టడి,అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ పర్యటనలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, రాంబాబు, పార్టీ సభ్యులు వి.నరసింహారావు, సిహెచ్.సుబ్బారావు, రైతులు నర్రెడ్డి గంగరాజు, నర్రెడ్డి వీరభద్రం, వి.శ్రీను పాల్గొన్నారు.

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

క్రిస్మస్‌ను పురస్కరించుకుని జిల్లాలోని క్రైస్తవ సోదరులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, దయ, కరుణ, ప్రేమ ప్రపంచానికి చాటిచెప్పిన ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతిఒక్కరూ సహనం, ప్రేమ కలిగి ఉండాలన్నారు. నిస్సహాయులపై కరుణ చూపాలని శతాబ్దాల క్రితమే క్రీస్తు ప్రబోధించారని గుర్తుచేశారు. క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

2.27 లక్షల మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు అధికప్రాధాన్యమిస్తూ ధాన్యంసేకరణ ప్రక్రియ చేస్తుందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి 5.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రాథమిక అంచనాగా ఉందన్నారు. 251 ఆర్‌బికెల ద్వారా ఇప్పటివరకూ 46,799 మంది రైతుల నుంచి రూ.495.84 కోట్లు విలువైన 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ధాన్యం విక్రయించిన తర్వాత సొమ్ములు చెల్లించేందుకు నిర్ణీత గడువు 21 రోజులు కాగా కేవలం మూడునాలుగు రోజుల్లోనే రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించడం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకూ 34,041 మంది రైతుల ఖాతాలకు రూ.367.08 కోట్లు జమయ్యాయని తెలిపారు. ఈ రెండు మూడురోజుల్లో సేకరించిన 9,699 మంది రైతులకు సంబంధించి రూ.111.60 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే వారి ఖాతాలకు ధాన్యం సొమ్ములు జమవుతాయని వివరించారు. మిగిలిన రైతుల నుంచి త్వరితగతిన ధాన్యం సేకరణకు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి పేర్కొన్నారు.

ఉత్తేజభరితం.. ఉత్సాహపూరితం

ముగిసిన హేలాపురి బాలోత్సవం-4

అంబరాన్నంటిన పిల్లల సంబరాలు

సాంస్కృతిక, అకాడమిక్ పోటీల్లో పాల్గొన్న వేలాదిమంది విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక అమీనాపేటలోని సురేంద్ర బహుగుణ స్కూల్ షేక్ సాబ్జీ స్మారక ప్రాంగణంలో జరుగుతున్న హేలాపురి బాలోత్సవం-4 రెండో రోజు ఆదివారం ఉత్తేజభరితంగా సాగింది. పిల్లల సంబరాలు అంబరాన్ని అంటాయి. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు పెద్దఎత్తున తరలివచ్చారు. 60 రకాల సాంస్కృతిక, అకాడమిక్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ అనేక ఉత్సవాల్లో సినీ పాటలే ప్రామాణికంగా నృత్యాలు సాగుతున్నాయని, కానీ బాలోత్సవంలో అభ్యుదయ సాహిత్యం ప్రాతిపదికన జానపద, ప్రాచీన కళల ఆధారంగా నృత్యాలతో పిల్లల సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాచీన, జానపద కళలు, సాహిత్యమే నేటి సినీ సాహిత్యానికి మూలాధారమన్నారు. బాలోత్సవ కార్యక్రమాల నిర్వహణ ద్వారా సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలలో పిల్లలు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించడం ద్వారా వారిలో మరింత ఆత్మస్థైర్యం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస, తపన ఫౌండేషన్ ఛైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆయన సతీమణి రేణుక, నాగహనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ టెక్నికల్ డైరెక్టర్ టి.భాస్కర్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాంసుందర్, తహశీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ పిల్లల జీవితంలో బాలోత్సవం మరుపురాని తీపి జ్ఞాపకమని చెప్పారు. పాశ్చాత్య విషసంస్కృతి వ్యాప్తి చెందిన ఈ రోజుల్లో బాల్యంలోనే అభ్యుదయ విలువలకు బాటలు వేయాల్సి ఉందన్నారు. చెడు సంస్కృతికి వ్యతిరేకంగా మంచిని ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, అమరావతి బాలోత్సవం నిర్వాహకులు రామరాజు, కాకినాడ క్రియా బాలోత్సవం నిర్వాహకులు జగన్నాధరావు, రాజేష్, జంగారెడ్డిగూడెం బాలోత్సవం నిర్వాహకులు సూర్యారావు, వెంకన్న బాబు, దేవరపల్లి బాలోత్సవం నిర్వాహకులు ఉండవల్లి కృష్ణారావు, హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం నాయకులు మారుబోయిన కోటేశ్వరరావు, జె.సత్యనారాయణరాజు, వి.వెంకటేశ్వరరావు, పి.మంగరాజు, మజ్జి కాంతారావు, దేవేంద్ర, కోట రవికుమార్, విజయలక్ష్మి, మోహిని, భారతి, నీలిమ, గంగాభవాని, శారద పాల్గొన్నారు.

జానపదాలకు విశేష ఆదరణ

బాలోత్సవం సంబరాల పోటీల్లో జానపద నృత్య పోటీలకు విశేష ఆదరణ లభించింది. జానపద నృత్య పోటీల్లో విద్యార్థులు పాల్గొని చూపరులను ఆకట్టుకున్నారు. పల్లె వాతావరణంతో కూడిన పాటలు, లంబాడీ జానపద నృత్యం, దేశభక్తి భావాలతో ఉన్న పాటలు జానపద నృత్య రూపకంలో పిల్లలు చక్కగా ప్రదర్శించారు. లఘు నాటికలు దేశ భక్తిని ప్రేరేపించే అంశాలు, కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న పాశ్చాత్య నాగరికత ప్రభావాలకు భిన్నంగా నేటితరానికి అవసరమైన అభ్యుదయ అంశాలతో కూడిన లఘు నాటికల ప్రదర్శన ఆకట్టుకుంది. ఏకపాత్రాభినయం, కోలాట నృత్యాలు, అభ్యుదయ పాటలు, విచిత్ర వేషధారణ, శాస్త్రీయ నృత్యం వంటి కల్చరల్ పోటీలు, మట్టి బొమ్మల తయారీ, క్విజ్, మెమొరీ, కథలు చెప్పడం వంటి అక్కాడమిక్ పోటీలు పెద్ద ఎత్తున సాగాయి. రెండో రోజు పోటీల్లో దాదాపు నాలుగు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాలోత్సవంతో చిన్నారుల్లో సాంస్కృతిక పోటీత్వం : కలెక్టర్ సతీమణి మానస

చిన్నారుల్లో సాంస్కృతిక పోటీతత్వం బాల్యం నుండే పెంపొందించడానికి హేలాపురి బాలోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సతీమణి డాక్టర్ మానస అన్నారు. బాలోత్సవం రెండో రోజు డాక్టర్ మానస తమ ఇద్దరు అమ్మాయిలతో పాల్గొన్నారు. వీరిద్దరూ మట్టిబొమ్మల సబ్ జూనియర్స్, విచిత్ర వేషధారణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ మానస మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవాలు నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నార న్నారు. బాల్యం నుండే చిన్నారులకు పోటీస్ఫూర్తి పెంపొందించడానికి బాలోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో 157 స్కూళ్లకు సంబంధించిన బాలబాలికలు పాల్గొనడం సంతోషం ఇచ్చిందని తెలిపారు. కోవిడ్ కారణంగా ఇంటికే పరిమితమైన పిల్లల్లో ఈ కార్యక్రమం ద్వారా వారికి మంచి ఉత్సాహం, మానసిక ఉల్లాసం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు వారి పిల్లలకు మంచి తర్ఫీదు ఇచ్చి వారి చిన్నారులను ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి మంచి ప్రోత్సాహం ఇచ్చారని, ఇదే ప్రోత్సాహాన్ని ప్రతి కార్యక్రమంలోనూ వారి చిన్నారులను పాల్గొనేలా చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలను చిన్నారులకు ఏర్పాటు చేసి వారి మానసిక ఉల్లాసానికి అందరూ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా హేలాపురి బాలోత్సవ కమిటీ వారికి, జిల్లా విద్యాశాఖ అధికారి, ఉపాధ్యాయులు, పోలీసు వారు, అభినందనలు తెలిపారు. తొలుత డాక్టర్ మానస బాలల ప్రదర్శించే కళారూపాలైన బాలల ఫ్యాన్సీ డ్రస్, లఘునాటిక, అభ్యుదయ దేశభక్తి గీతాలాపన సోలో, శాస్త్రీయ నృత్యం, ఇంగ్లీషు రైమ్స్‌లను తిలకించారు. .

క్రీడాస్ఫూర్తిని పెంచేందుకే ఆడుదాం - ఆంధ్రా

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఆరోగ్యకర సమాజాన్ని కాంక్షిస్తూ ముఖ్యంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం ..ఆంధ్రా క్రీడా సంబరాలు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహించే ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆదివారం నిర్వహించిన 3కె రన్‌ను ఎస్‌పి డి.మేరీప్రశాంతితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెసి బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్.పెదబాబు, ఈడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఆళ్ల సతీష్ చౌదరి, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలి, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, డిఎల్‌డిఒ లక్ష్మి, డిఎస్‌ఒ ఆర్‌ఆర్.రాజు తహశీల్దార్లు బి.సోమశేఖర్ విజయకుమార్, ఎంఇఒ సబ్బితి, ఎన్‌ఐసి శర్మ పాల్గొన్నారు.

ఉత్సాహపూరితంగా ప్రారంభమైన ఆడుదాం-ఆంధ్రా టోర్నమెంట్ 3కె రన్ వట్లూరు సమీపంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నుంచి ప్రారంభమై సత్రంపాడు, సిఆర్ రెడ్డి కళాశాల, ఆర్‌టిసి కొత్తబస్టాండ్, జెడ్‌పి కార్యాలయం మీదుగా ఇండోర్ స్టేడియానికి చేరింది. పెద్దల నుంచి చిన్నారుల వరకూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, క్రీడలను ప్రోత్సహించేందుకు సిఎం జగన్ మంచి కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికితీయడమే కాకుండా ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి ఐదు దశల్లో పోటీలు నిర్వహించబడతాయన్నారు. ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న క్రీడా సంబరాల్లో పాల్గొనేందుకు 1,47,000 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. జిల్లాలోని 625 గ్రామ సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ క్రీడా పోటీల నిర్వహణకు 320 ఆట స్థలాలను సిద్ధం చేశామన్నారు. క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణకు 14,354 టీములను ఏర్పాటు చేసి 7198 మ్యాచ్‌లు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుత కాలంలో మొబైల్, టివి తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లకు అలవాటుపడి బయటకు వచ్చి ఆడుకోవాలనే ఆసక్తి తగ్గుతున్న క్రమంలో ఆడుదాం.. ఆంధ్రా టోర్నమెంట్ ద్వారా బయటకు వచ్చి ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభ బయటకు వచ్చేందుకు ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమం మంచి ఫ్లాట్ ఫామ్ అని పేర్కొన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం, మానసిక ధైర్యం కలుగుతుందన్నారు. జెసి లావణ్య వేణి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉండాలని క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఉద్దేశించబడిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా సంబరాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షులు శేషగిరిరావు మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం సొసైటీ మాజీ అధ్యక్షులు చాట్రాతి శేషగిరిరావు(74) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రమైన టి.నరసాపురం గ్రామానికి చెందిన శేషగిరిరావు పంచాయతీ సర్పంచిగా ఐదేళ్లు, సొసైటీ ఛైర్మన్‌గా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి, సొసైటీ అభివృద్ధిలకు కీలకపాత్ర పోషించడంతో పాటు రైతులకు ఎనలేని సేవలు అందించారు.

శేషగిరిరావు (ఫైల్)

రాజకీయ నాయకుడిగా పలుపార్టీల్లో కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను రాజమండ్రి ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన మతదేహాన్ని తపన ఫౌండేషన్ అధ్యక్షులు, బిజెపి నాయకులు గారపాటి సీతారామాంజనేయులు, చౌటపల్లి విక్రమ్ కిషోర్, మండలంలోని ఆయా పార్టీల నేతలు నివాళులర్పించారు. కామవరపుకోట మండల సిపిఐ కార్యదర్శి టివిఎస్.రాజు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎఐటియుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షుడు కొండముచ్చు శ్రీనివాసరావు, మక్కినవారిగూడెం ముఠా వర్కర్స్ సీనియర్ నాయకులు మల్లెల సత్యనారాయణ, కాళహస్తి సుబ్బారావు, ఏకాంబరం చాట్రాతి శేషగిరి మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్‌పిటిసి, ఎంపిపి

ఉత్సాహభరితంగా 'ఆడుదాం ఆంధ్రా 3కె రన్'

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని 16 గ్రామాల్లో ఉత్సాహభరితంగా ఆడుదాం ఆంధ్ర 3కె రన్ ఆదివారం నిర్వహించారు. ఆయా పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆడుదాం ఆంధ్ర అవగాహన ర్యాలీ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావు, వైసిపి కోటగిరి రాజానాయన, పాములు గంగాధర్ రావు, సర్పంచులు పేరంకృష్ణ, రంగు ధనలక్ష్మి గాంధీ, రాజబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, పుట్ట మోహన్ రావు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధా, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, మువ్వ స్రవంతి, వైవి.ప్రసాదు, సచివాలయ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5న ఓటర్ల తుది జాబితా

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నియోజకవర్గంలో 2024వ సంవత్సరం జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల అవుతుందని మండల తహశీల్దార్ ఎల్లారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ వరకు ఫారం నెంబర్ 6, 7, 8లు ప్రజల నుంచి స్వీకరించి క్షేత్రస్థాయి పరిశీలనతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం ముందుకు వెళ్లినట్లు తెలిపారు. నామినేషన్ గడువు పూర్తయ్యే లోపు ఓటరుగా నమోదు అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు.

లాభార్జనకు భూసార పరీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలో వికసిత భారత్ సంకల్పయాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి చాముండేశ్వరి మాట్లాడుతూ సాగుకు ముందు భూసార పరీక్షలు ఎంతో అవసరమన్నారు. భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ విధానాన్ని రైతులకు వివరించారు. భూసార ఫలితాల మేరకు సాగును సారవంతం చేస్తే అధిక లాభాలు ఆర్జించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తోమ్మండరు బుజ్జి, రైతులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లను డాక్టర్ చంద్రశేఖర్

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు ఆదివారం కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ నవంబర్ 26, డిసెంబర్ 3వ తేదీన నిర్వహించిన మెగా ఐ క్యాంపులో 2,200 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, 16 మందికి కాంటాక్ట్ ఆపరేషన్లు, 1,262 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందించినట్లు తెలిపారు.

పూజలో ఛైర్మన్ దంపతులకు ఫోటో అందిస్తున్న ఆలయ అర్చకులు

షష్ఠి ఉత్సవాలకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఆదివారం ఆలయ మాజీ ఛైర్మన్ శొంఠి నాగరాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శొంఠి నాగరాజు దంపతులు సకుటుంబసమేతంగా విచ్చేసి స్వామి వారి పుట్టలో పాలుపోసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాజీ ఛైర్మన్ దంపతులకు ప్రత్యేకపూజలు జరిపించి వారిని శేషవస్త్రాలతో సత్కరించి స్వామి వారికి చిత్రపటాన్ని, తీర్థ, ప్రసాదాలను అందించారు.

మండలంలోని శింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక షష్ఠి కళ్యాణ మహోత్సవాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు.

ఉంగుటూరు : కైకరంలో జరుగుతున్న సుబ్రహ్మణ్య షష్ఠిని పశ్చిమగోదావరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్ దంపతులు ఆదివారం తిలకించారు. తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించారు. డిప్యూటీ కలెక్టరు దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ శానం నరసింహారావు, పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కొవ్వొత్తులతో అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. పలు చోట్ల చెవిలో పువ్వులు పెట్టుకుని, మోకాళ్లపై నించుని, సమ్మె శిబిరంలో కొవ్వొత్తులు వెలిగించి, ఎర్రకండువాలు కప్పుకుని వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి దిగి వచ్చే వరకూ వెనక్కి తగ్గేదే లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా 13 రోజులైనా ముఖ్యమంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ సమ్మె ప్రారంభించి 13 రోజులైనా జగన్మోహన్ రెడ్డి దున్నపోతు మీద వర్షం పడినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వి.సాయిబాబు ప్రసంగించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు స్వప్న, అనంతలక్ష్మి, సుజాత, రాణి, వల్లి, కృష్ణవేణి, రామలక్ష్మి, సీతామాలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ సంఘీభావం తెలియజేశారు. జగన్మోహన్‌రెడ్డి నియంతృత విధానాలు మాని వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

నిడమర్రు : అందరి జీవితాల్లో వెలుగులు నింపుతానని చెబుతున్న జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీ వర్కర్స్ సమ్మె విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె 13వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ అంగన్వాడీలపై దయా, కరుణ చూపించలేని ఈ ప్రభుత్వాన్ని రాబోయే కాలంలో కార్మికవర్గం ఇంటికి సాగనంపుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.రామలక్ష్మి, నిమ్మల పార్వతి, కోన జయమ్మ, ధనలక్ష్మి, కెవి.సత్యవతి, సబీనా, సుభాషిని పాల్గొన్నారు.

భీమడోలు : నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న అంగన్వాడీల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని, ఈ విషయమై నిరంకుశంగా వ్యవహరించటం సరికాదని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. అంగన్వాడీలు మండలంలో కొనసాగిస్తున్న నిరవధిక సమ్మె ఆదివారంతో 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ క్రిస్మస్ నాటికి అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రత్నకుమారి, జయలక్ష్మి నాయకత్వం వహించారు.

భీమడోలులో అంగన్వాడీలు ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఆదివారం సాయంత్రం భీమడోలు పురవీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె పదమూడవ రోజూ కొనసాగింది. జగన్ ప్రభుత్వంపై పాటలు పడుతూ నిరసన తెలిపారు. సమ్మెలో భాగంగా రెండవ రోజు రిలే దీక్ష చేపట్టారు. ఒబిసి నాయకులు లావేటి వీర శివాజీ శిబిరానికి చేరి సమ్మెకు మద్దతు తెలిపారు. గ్రామాల్లో తమ పరిధిలోని లబ్ధిదారులు, సంఘగ్రామ పెద్దలతో కలిసి కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వేలేరుపాడు : ఆదివారం 13వ రోజు అంగన్వాడీ సమ్మె వేలేరుపాడు మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా మండల టిడిపి నాయకులు, పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అలాగే శాఖమూరి సంజీవులు

నిడమర్రు : కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సర్పంచుల తరుపున మద్దతు తెలిపారు.

చాట్రాయి : సుప్రీంకోర్టు సిఫార్సు మేరకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, ఉద్యోగంలో ఉంటూ చనిపోయిన కుటుంబంలో మరొకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె 13వ రోజుకు కొనసాగింది. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తూ అంగన్వాడీ కార్యకర్తలు ,హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జ్యోతి రాణి, ఏసమ్మ, శివకుమారి, ప్రమీలారాణి నాయకత్వం వహించారు.

భీమడోలు : కొవ్వొత్తులతో అంగన్‌వాడీల నిరసన

కొయ్యలగూడెం : అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం పట్టణంలో గత పది రోజుల నుంచి అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షకు ఆదివారం సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, గుదే శ్రీను, సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు, అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మండవల్లి : పోరాట పటిమ కలిగి పోరాడితే సంకల్పం

జీలుగుమిల్లి : చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన

దానంతట అదే సిద్ధిస్తుందని బిసి సంక్షేమ సంఘం నాయకులు లావేటి వీర శివాజీ స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న ధర్నా ఆదివారం 13వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన శిబిరం వద్దకు చేరుకుని వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంగన్వాడీలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ లీడర్లు చల్లాయమ్మ, వాణి, విజయలక్ష్మి, ఉమాదేవి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ ఆదివారానికి 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద చెవిలో పూలు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సమ్మెకు సిపిఎం, సిఐటియు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెల్లం రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకురాలు ఎమ్.నాగమణి, కార్యదర్శి కొండల రావు, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, ఎస్తేరు, సరళ, పూర్ణ పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రభుత్వం అంగన్వాడీలపై కక్ష సాధింపు చర్యలు మాని, అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిచో కార్మిక సంఘాలన్నీ ఏకమై సమ్మెను మరింత ఉధృతం చేస్తాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.సత్యనారాయణ తెలిపారు. అంగన్వాడీ యూనియన్ పిలుపు మేరకు ఆదివారం అంగన్వాడీల సమ్మె శిబిరంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మాయమాటలతో అంగన్వాడీల సమ్మెను నిర్వీర్యం చేయాలని చూస్తుందని, అంగన్వాడీ కోర్కెలన్నీ నెరవేరేవరకు ఇదే స్ఫూర్తితో సమ్మె చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.మాణిక్యం, జి.అంజమ్మ పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె 13రోజైన ఆదివారం కూడా కొనసాగింది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె లో కూర్చున్న కార్యకర్తలు నిరసన గళం విప్పారు. జీతాలు పెంచాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, మిని సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్ లు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని నినాదాలు చేశారు. వీరి సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం మండల

పెదవేగి : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

నాయకులు అనుమోలు మురళి మద్దతు తెలిపారు.

పోలవరం : మండలంలో 13వ రోజుకు చేరిన అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం ఎర్ర కండువాలు వేసుకుని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సమ్మెలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి, సత్యవేణి, సత్యవతి, పద్మావతి, సీత, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

పెదవేగి : పెదవేగి మండల కేంద్రంలో 13వ రోజు అంగన్వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం మద్దతు తెలిపారు.

ముదినేపల్లి : తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారంతో 13వ రోజుకు చేరుకుంది. కైకలూరుకు చెందిన వీర శివాజీ దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. సాయంత్రం అంగన్వాడీలు వారి పరిధిలో కొవ్వొత్తులు ర్యాలీ చేశారు.

సిపిఎం సీనియర్ నేత దుర్గారావు మృతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

దుర్గారావు మరణం మండలంలో వ్యవసాయ కార్మికులకు, పేదలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, మాజీ శాఖా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కంచిపాటి దుర్గారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడ ఆసుపత్రిలో శనివారం రాత్రి మరణించారని వారు తెలిపారు. మహాదేవపురం గ్రామంలోనూ, మండలంలోనూ ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, ఇళ్ల స్థలాలు, భూముల సమస్యలపై పోరాడిన నేత అని వారు కొనియాడారు. దుర్గారావు మరణం వారి కుటుంబానికికే కాక మండలంలోని వ్యవసాయ కార్మికులకు కూడా తీరని లోటని అన్నారు. దుర్గారావు మృతికి సంతాప సూచికగా ఆయన భౌతికాయానికి ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, సిపిఎం మండల నాయకులు భాస్కరరావు, మానుకొండ వీర్రాజు నివాళులర్పించారు.

వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ఆర్థికసాయం

జంగారెడ్డిగూడెం : స్థానిక నాల్గవ వార్డు ఇందిరానగర్ కాలనీలోని వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం వారధి ట్రస్టు వ్యవస్థాపకులు వలవల తాతాజీ మిత్రులు యమసాని శ్రీనివాసరెడ్డి, అనూష దంపతుల వ్యక్తిగత వితరణతో సెంట్ జాన్సన్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న కొడ్డేటి మౌనిక అనే విద్యార్థినికి విద్యాప్రోత్సాహక సహాయంలో భాగంగా రూ.5 వేలు, దాత తండ్రి భాస్కరరెడ్డి, సోదరి పోతుల మాధవి చేతుల మీదుగా అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చింతల నాని మాట్లాడుతూ దాతలకు, లబ్ధిదారులకు మధ్య వారధిగా నిలిచిన ట్రస్ట్ ద్వారా వలవల తాతాజీ చేస్తున్న కృషి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో వలవల మేరీసుశీలా, వారధి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 27 నుంచి తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం చింతలపూడి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం ఒడితే బాలు అధ్యక్షతన పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి మున్సిపల్ వర్కర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తొర్లపాటి బాబు మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీలో

సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిబాబు

పనిచేస్తున్న 72 మంది కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, గత మూడు సంవత్సరాల నుంచి వీరికి రావలసిన జీతం ఎరియర్స్, హెల్త్ అలవెన్స్ ఎరియర్స్ చెల్లించాలని, జనాభా కనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీరాములు, వెంకటయ్య, మరిదాసు, వెలగాడు, అనురాధ పాల్గొన్నారు.

ఎసిఎఫ్ జనరల్ సెక్రటరీగా పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి - మండవల్లి

యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ జనరల్ సెక్రటరీగా భైరవపట్నంకు చెందిన అల్లాడ పూర్ణచంద్రరావు ఎంపికయ్యారు. విజయవాడలోని యాంటీ కరప్షన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్స్ డాక్టర్ జాకీర్ షరీఫ్, షేక్ రజాక్‌లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ జనరల్‌గా అల్లాడ పూర్ణచంద్రాలను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎసిఎఫ్ఐ గురించి ప్రజలకు తీసుకువెళ్లి, గ్రామ స్థాయిలో సదస్సు ఏర్పాటు చేసి దీని ఆవశ్యకత గురించి ప్రతి ఒక్కరికి తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తానని

జనరల్ సెక్రటరీగా ఎంపికైన చంద్రరావును

అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో, దేశంలో అవినీతిపై పోరాడే వారి కొరత తీవ్రంగా ఉందని అవినీతిని అంతమొందించడం కోసం పట్టుదలతో పనిచేసేవారు పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని కోరారు. నాపై నమ్మకం ఉంచి జనరల్ సెక్రెటరీగా నియమించినందుకు ఆయన అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.


జనసేనలో చేరిన వైసిపి నేతలు

జనసేనలోకి పలువురు..

ప్రజాశక్తి - ఉంగుటూరు

నియోజకవర్గ జనసేన కార్యాలయం నారాయణపురంలో నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామానికి చెందిన పలువురు వైసిపి నేతలు జనసేనలో చేరారు. మద్దా ప్రకాశం, పందిరి కట్లయ్య, సిరింగి జాన్, మద్దా మోషే, బేతళ పెద్దిరాజు, పెనుగొండ మీఖయేలు, దాసి అశోక్, పెనుగొండ తుఫాన్, ఆలమూరి చిన్నబాబు, ముంగమూరి చంద్రశేఖర్, సిరింగి సునీల్, నూతలపాటి చిట్టియ్య, బాతు వినయ్, నూతలపాటి సంతోష్, బాతు కిషోర్ కుమార్, మద్దా తంబి, కొమ్మి క్రాంతి, కోట కన్నయ్య, ఇతర నేతలు ధర్మరాజు ఆధ్వర్యంలో చేరారు. ధర్మరాజు వారికి పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ జనసేనలోకి యువత మాత్రమే కాకుండా పెద్దలు కూడా చేరటానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉండటంతో ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపుకు కృషి చెయ్యాలని వారిని కోరారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను, ప్రజల కోసం ఆయన పడుతున్న కష్టాల్ని ప్రజలకి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వంగ రఘు, నియోజకవర్గ ఐటి వింగ్ కోఆర్డినేటర్ అయితం ప్రసాద్, లంక రాంబాబు, జనసైనికులు పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు

ప్రజాశక్తి - ముదినేపల్లి

క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో ముఖ్యమైన క్రిస్మస్ పండుగకు మండలంలోని చర్చిలోని ముస్తాబయ్యాయి. దీంతో చర్చిలన్నీ విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తున్నాయి. ముదినేపల్లిలోని ఆర్‌సిఎం చర్చితో పాటు పలు ప్రధాన చర్చిలు విద్యుత్ దీపాలతో మిరుమెట్లు గొలుపుతున్నాయి.

ముదినేపల్లి : విద్యుత్‌దీపాలతో అలంకరించిన ఆర్‌సిఎం చర్చి

మండలంలోని గురజ గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పేద మహిళలకు జగనన్న శారదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చీరలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పాస్టర్ రాజు, దావీదు ఆహ్వానం మేరకు గురజ చర్చికి వెళ్లిన వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యురాలు, హైకోర్టు అడ్వకేట్ తిరువీధుల శారద చర్చి పాస్టర్లతో ప్రార్థన చేయించారు.

కొయ్యలగూడెం : ప్రపంచ దేశాలలో జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ పండుగ అని పరింపూడి గ్రామపంచాయతీ సర్పంచి ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. పట్టణంలో మన్నా చర్చి వద్ద జరిగిన క్రిస్మస్ వేడుకలలో సర్పంచి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని, క్రిస్మస్ అంటే ఏసుక్రీస్తుని ఆరాధించడమని, ప్రపంచ దేశాలలో కూడా జరుపుకునే అతి పెద్ద పండుగ క్రిస్మస్ అని ఆమె తెలిపారు. చిన్నారుల డాన్సులు, నాటికలు, ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి కంచుమర్తి బాబురావు (మోషే)యూత్ సభ్యులు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

ముసునూరు : శాంతి, స్వభావం మానవ జీవితంలో విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని శాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ శివ కోటి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ముసునూరులోని శ్రీశాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు వేషధారణలతో గ్రామస్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని ప్రార్థనా మందిరాలు ముస్తాభయ్యాయి. మండలంలోని అప్పలరాజుగూడెం, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం, బంధంచర్ల తదితర గ్రామాల్లో పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు చర్చిలపై స్టార్‌లు ఏర్పాటు చేశారు. రంగు రంగుల అలంకారాలతో లైటింగ్‌లు ఏర్పాటు చేయడంతో ప్రార్థనా మందిరాలు సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో ముస్తాభైన చర్చిలు, చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

సానారుద్రవరంలో రంగా విగ్రహావిష్కరణ

కలిదిండి : మండలంలోని సానారుద్రవరంలో కీర్తిశేషులు మాజీ ఎంఎల్ఎ వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని వంగవీటి రాధాకృష్ణ ఆవిష్కరించి మాట్లాడారు. కలిదిండి ప్రధాన సెంటర్‌లోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, టిడిపి నాయకులు కొడాలి వినోద్, సొసైటీ అధ్యక్షులు వడ్లాని పార్థసారథి పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - పోలవరం

గూటాల గ్రామంలో గోదావరి తీరంలోని శ్రీఆంజనేయస్వామి వారి షష్ఠి 66వ వార్షిక మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పోలవరం ఎస్ఐ ఎస్-ఎస్.పవన్ కుమార్ దంపతులు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు.

నేరాలు - ఘోరాలు

దిగవల్లి చెరువులో గుర్తుతెలీని మృతదేహం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలో దిగవల్లి గ్రామంలోని నల్లయ్యకుంట చెరువులో ఆదివారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కొందరు వ్యక్తులు చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లగా మృతదేహం తేలియాడుతూ ఉండటాన్ని గమనించారు. స్థానికులు సమాచారాన్ని రూరల్ పోలీసులకు తెలపగా రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేసి వివరాలు తెలియజేస్తామన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ
జంగారెడ్డిగూడెం డివిజన్, ఏలూరు జిల్లా
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు
జంగారెడ్డిగూడెం డివిజన్, ఏలూరు జిల్లాలోని వై.యస్.ఆర్. జగనన్న లేఔట్ కాలనీలు (మొత్తము 58) నందు స్వాగత ద్వారముల నిర్మాణము కొరకు ప్రథమ పిలుపుగా అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్ ఫార్మ్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. సమాచారము తేదీ. 25-12-2023 సా॥ 5.00 గం॥ల నుండి www.e-procurement.gov.in నందు సందర్శించగలరు.
1) పోలవరం నియోజకవర్గము 2) చింతలపూడి నియోజకవర్గము
3) గోపాలపురం నియోజకవర్గము
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు (గృహ), జంగారెడ్డిగూడెం డివిజన్